సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



మహతి.. రజతోత్సవ హారతి

మహతి సంస్థ రజతోత్సవానికి సిద్ధమైంది. పాతికేళ్లుగా సంస్థ కళాసేవ చేస్తోంది.

- 8లో



అవగాహనతోనే తెగుళ్లకు చెక్

అవగాహనతో తెగుళ్లకు చెక్ పెట్టవచ్చని అధికారులంటున్నారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

- 8లో

23న అండర్-19 వాలీబాల్ జిల్లా జట్టు ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం పట్టణంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో అండర్ -19 వాలీబాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక శనివారం నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎన్.రామన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ చదువుతూ 19 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు క్రీడాకారులు ఫోన్ నంబర్ 98494 51005ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు టెక్కలి విద్యార్థిని



సరితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. టెక్కలి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.సరితకు ఈ అవకాశం దక్కినట్లు హెచ్‌ఎం ఎస్.శోభారాణి, పీడీలు డి.సూర్యకాంతం,బి.ఆదిశేషు గురువారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

'అకడమిక్ క్యాలెండర్ అమలు చేయాల్సిందే'



నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పక్కాగా అకడమిక్ క్యాలెండర్ అమలు చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పాలక మండలి సమావేశ హాల్‌లో అకడమిక్, పరిపాలన అంశాలపై అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, లా, కామర్స్ అన్ని కోర్సుల్లో సెమిస్టర్ యూనిట్‌గా క్లాస్ వర్క్ పక్కాగా జరగాలని అన్నారు. మిడ్ సెమిస్టర్లు, ప్రయోగ పరీక్షలు, సెమిస్టర్ ఎండ్ పరీక్షలు షెడ్యూల్ మేరకు జరగాలని అన్నారు. 90 రోజుల పాటు అకడమిక్ క్యాలెండర్ మేరకు పరీక్షలు జరగాలని చెప్పారు. విద్యార్థుల హాజరు మెరుగ్గా ఉండేలా విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వర్క్‌లోడ్‌కు అనుగుణంగా టైమ్ టేబుల్ ప్రతి విభాగం సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సిలబస్‌లో వచ్చిన మార్పులపై దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత పాల్గొన్నారు.


'హిందీ భాషాభివృద్ధికి కృషి చేయాలి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఈఓ

కోటబొమ్మాళి: ప్రతి పాఠశాలలో హిందీ భాషాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. ఆయన గురువారం కోటబొమ్మాళి జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్‌లో జరిగిన హిందీ దివస్ కార్యక్రమంలో డీఈఓ ఎస్.వెంకటేశ్వరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భాషగా ఉన్న హిందీని విద్యార్థులంతా తప్పనిసరిగా నేర్చుకోవాలని, అలాగే ఆ భాషలో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. డీఈఓ వెంకటేశ్వరావు మాట్లాడుతూ హిందీ చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకోవాలన్నారు. జిల్లా ఎన్‌సీసీ కమాండర్ అమిత్ బెనర్జీ మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. కోటబొమ్మాళి హైస్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ కేంద్రం మంజూరుకు కృషి చేస్తానని అమిత్ బెనర్జీ ప్రకటించారు. హిందీ దివస్ బాగా నిర్వహించడంపై హెచ్‌ఎం డబ్బీరు గోవిందరావును అందరూ అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న సాహితీ ప్రసంగం



ప్రసంగిస్తున్న బాబూరావు

శ్రీకాకుళం కల్చరల్: ఉపనిషన్మందిరంలో గురువారం నిర్వహించిన సాహితీ ప్రసంగం ఆకట్టుకుంది. ఉపనిషన్మందిరం, మహతి సంయుక్త నిర్వహణలో జరుగుతున్న సాహిత్య గణపతి ఉపన్యాసాలలో భాగంగా గురువారం 'చంద్రుని కంతయై' అంశంపై ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు పండితుడు ఆర్.బాబూరావు మాట్లాడుతూ వామనుడి జననంతో కలిగిన ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, ఐ.టి.కుమార్, తవుడు, పులఖండం శ్రీనివాసరావు, సాయిప్రసాద్, సనపల నారాయణమూర్తి పాల్గొన్నారు.

మన దారులు భేష్

- ఉత్తమ ప్రాజెక్టుగా ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు
- ఏఐఐబీ బ్యాంకు సాయంతో చేపట్టిన రోడ్ల నాణ్యత బాగు
- జిల్లాలోని 395 రహదారుల్లో దాదాపుగా పూర్తయిన 278 రోడ్లు
- అత్యల్ప జనాభా గల గ్రామాలకు రహదారుల నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు



పొందూరు మండలం రాపాక-దళ్లవలస రహదారి బీటీ రోడ్డు

అరసవల్లి: ఏపీ రూరల్ రోడ్ ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా కితాబులందుకుంటోంది. కనీసం 250 మంది జనాభా మించిన గ్రామాలకు కచ్చితంగా బ్లాక్ టాప్ (బీటీ)/సీసీ (సెమెంట్ కాంక్రీట్) రహదారులను నిర్మించాలని ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు కింద ప్రభుత్వం దారులు వేస్తోంది. ఈ రహదారుల నాణ్యత బాగుండడంతో ఉన్నత స్థాయి ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ మేరకు తాజాగా బ్యాంకు ఇంప్లిమెంటేషన్ సపోర్టు మిషన్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏపీఆర్‌ఆర్ ప్రాజెక్టును ఉత్తమ ప్రాజెక్టుగా గుర్తించాయి. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సాయంతో రూరల్ ప్రాంతాలకు రహదారుల నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినప్పటికీ ఆశించిన మేరకు పనులు రోడ్డెక్కలేదు. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో పలు జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా నాలుగు ప్యాకేజీలుగా రహదారులు నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు కాంట్రాక్ట్‌లు దక్కించుకునే వ్యవహారంపైనే దృష్టి పెట్టిన అప్పటి ప్రభుత్వం నేతలు రహదారుల నిర్మాణాలను గాలికి వదిలేసింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3665 రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం ఏఐఐబీ-1ఎ కింద 312 పనులు, ఏఐఐబీ-1బి కింద 83 పనులను గుర్తించి రహదారులను నిర్మాణానికి చర్యలు చేపట్టింది.



కోటబొమ్మాళి మండలం వింజామపాడు గ్రామానికి జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం

2019 తర్వాతే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఏఐఐబీ ప్యాకేజీ కింద గ్రామీణ రహదారుల నిర్మాణాల పనులు 2019 తర్వాత ఊపందుకున్నాయి.

- జిల్లాలో ప్యాకేజీ-1 కింద పాలకొండ, ఆమదాలవలస, పాతపట్నం,
- ప్యాకేజీ-2 కింద ఎచ్చెర్ల, రాజాం
- ప్యాకేజీ-3 కింద పలాస, ఇచ్ఛాపురం
- ప్యాకేజీ-4 కింద శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాలు చొప్పున మొత్తం 395 రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదించారు.

ఈ మేరకు ఏఐఐబీ -1ఎ కింద ప్రతిపాదించిన 312 పనులను 484.43 కిలోమీటర్లకు రూ.352.78 కోట్లు అంచనాతో బీటీ రోడ్లు మంజూరు కాగా, ఇందులో 266 రహదారులు పలు దశలుగా నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. దీంతో ప్రస్తుతం వరకు రూ.65.59 కోట్లు ఖర్చు కాగా, 102.71 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. అలాగే ఏఐఐబీ -1బి కింద ప్రతిపాదించిన 83 పనులు 205.68 కిలోమీటర్లకు రూ.46.92 కోట్ల అంచనాతో బీటీ రోడ్లు మంజూరు కాగా, ఇందులో 12 రోడ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. 71 పనుల కేటాయింపు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి.

నాణ్యతలో రాజీ పడే ప్రసక్తి లేదు



ఏఐఐబీ సహకారంతో నిర్మిస్తున్న పనుల్లో ప్యాకేజీ-1 మినహా మిగిలిన ప్యాకేజీల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా పనులు జరుగుతున్నాయి. దీంతో బ్యాంకు ప్రతినిధులు ఈ ప్రాజెక్టును ఉత్తమ ప్రాజెక్టుగా ప్రశంసించారు. త్వరలోనే జిల్లాలో 4 ప్యాకేజీల్లోనూ అన్ని రహదారుల నిర్మాణం చేసేలా చర్యలు చేపడతాం.

– వీఎస్ఎస్.మూర్తి, ఎస్ఈ, పంచాయతీరాజ్.



పోలాకి మండలం గోకయ్యవలస గ్రామానికి వేసిన సీసీ రోడ్డు

గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఢిల్లీలో నిర్వహించే 2024 గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శుక్రవారం ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా జాతీయ సేవాపథకం సమన్వయకర్త డాక్టర్ ఎం.అనురాధ గురువారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మైదానంలో ఈ ఎంపికలు జరుగుతాయని అన్నారు. మహిళా వలంటీర్లు ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు.

ఫుట్‌బాల్ జూనియర్ నేషనల్స్ పోటీలకు నరసన్నపేట విద్యార్థి



గౌతమ్ సాయి

నరసన్నపేట: జూనియర్ నేషనల్స్ అండర్-17 విభాగంలో మధ్యప్రదేశ్‌లో జరిగే ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నరసన్నపేట పురుషోత్తం నగర్‌కు చెందిన గౌతమ్ సాయి పాల్గొననున్నాడు. ఈ నెల 22 నుంచి జరగబోయే నేషనల్స్‌లో ఆంధ్ర తరఫున గోల్ కీప ర్‌గా పాల్గొంటున్నట్లు కోచ్ రాకేష్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం జోనల్ ఇన్‌చార్జిగా వాసుదేవరావు



గణపతినాయుడు.



గేదెల వాసుదేవరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం జోనల్ ఇన్‌చార్జిగా గేదెల వాసుదేవరావు, అధ్యక్షులుగా జీవీవీ గణపతినాయుడులను నియమించారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

వంశధారలో పెరిగిన వరద



బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరద నీరు

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద గురువారం వరద నీరు పెరిగింది. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో గత రెండురోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారానికి బ్యారేజీ వద్ద 37.72 మీటర్ల నీటిమట్టం ఉంది. బుధవారం ఉదయం నాటికి 11,418 క్యూసెక్కులు ఉన్న ప్రవాహం గురువారం వేకువకు పెరిగి 28,050 క్యూసెక్కులకు చేరింది. ఉదయం 5 గంటలకు 32,300 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. దీంతో వంశధార అధికారులు అప్రమత్తమయ్యారు. వచ్చిన నీటిని 17గేట్లు పైకి ఎత్తి దిగువకు విడిచిపెట్టారు. ఉదయం 7 గంటలకు 37,450 క్యూసెక్కులకు పెరిగి సాయంత్రం 4 గంటలకు 34,200 క్యూసెక్కులకు వరద కాస్త తగ్గిందని ఇన్‌చార్జ్ డీఈ వై.అనిల్‌కుమార్ తెలిపారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 613 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1867 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు డీఈ తెలిపారు.

బాహుదా.. చూస్తే ఫిదా



ఈదుపురం వంతెన వద్ద బాహుదా నది జలకళ

ఇచ్ఛాపురం రూరల్: గత రెండు రోజుల పాటు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల్లో కురిసిన మోస్తరు వర్షాలకు బాహుదా వరద నీటితో కళకళలాడుతోంది. దీంతో బొడ్డబడ, బిర్లంగి, కేదారిపురం, కొళిగాం, హరిపురం, మశాఖపురం, లొద్దపుట్టి, ఈదుపురం, ఇన్నేశుపేట, ధర్మపురం, జగన్నాథపురం, కేశుపురం, బూర్జపాడు, డొంకూరు, లక్ష్మీపురం పంట పొలాలకు అవసరమైనంత సాగునీరు అందడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

2 గంటల్లోనే రేషన్ కార్డు



మందస: ఓ వలస జీవికి రెండు గంటల్లోనే రేషన్ కార్డు అందించిన ఘటన ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒడిశా రాష్ట్రంలో గుసారి బ్లాక్‌లోని బొమ్మిక అనే గ్రామం నుంచి మూడేళ్ల కిందట కిక్కర జోగమ్మ అనే వృద్ధురాలు మందస మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీలో గల సందిగాం అనే గ్రామానికి వలస వచ్చింది. ఒడిశా నుంచి రావడంతో ఆమెకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చేరలేదు. ఏం చేయాలో తెలీక ఇటీవల గ్రామ వలంటీరు లండ తిరుపతిరావు తన సమస్యను విన్నవించుకుంది. సమస్యను విన్న వలంటీరు తిరుపతిరావు కొంకడాపుట్టి సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ సవర మోహన్ వద్దకు జోగమ్మను తీసుకెళ్లి రేషన్‌కార్డు లేదని వివరించగా.. ఆయన రేషన్ కార్డుకు దరఖాస్తు చేశారు. అన్ని వివరాలు సక్రమంగా ఉండడంతో కేవలంలో రెండు గంటల్లోనే జోగమ్మకు సర్పంచ్ మజ్జి కుమారచంద్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వర బృందావన్, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది రేషన్ కార్డు అందజేశారు. దీంతో ఆమె సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అర్హులందరికీ పథకాలు వర్తిస్తున్నాయి. స్పందనలో సమస్యలను పరిష్కరిస్తున్నాం. వ్యక్తిగతంగా కొంతమంది సమస్యలను ఫిర్యాదు చేస్తున్నారు. వీరికి ప్రోపర్ చానెల్ ద్వారా పరిష్కరించి, పథకాలను మంజూరు చేయిస్తున్నాం. ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందివ్వాలన్న మంచి సంకల్పంతో ఉంది. దీన్ని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలి.

– వాయలపల్లి తిరుమలరావు, ఎంపీడీఓ, మందస.



కొంకడాపుట్టి సచివాలయంలో రైస్‌కార్డు అందుకుంటున్న వృద్ధురాలు కిక్కర జోగమ్మ

సీఎంకు రుణపడి ఉంటాను

ఒడిశా నుంచి ఆంధ్రాకు వలస వచ్చాను. తెలుగు మాట్లాడడం సక్రమంగా రాని పరిస్థితి. పేదరికంతో బాధ పడుతున్నాను. రేషన్‌కార్డు లేకపోవడంతో నిత్యావసర సరుకులతో పాటు పథకాలు కూడా వర్తించలేదు. ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావుకు సమస్యను వివరించాను. ఆయన చొరవతో వలంటీరు వద్దకు వెళ్లాను. ఆయన సచివాలయానికి తీసుకెళ్లి కార్డుకు దరఖాస్తు చేయించారు. సుమారు రెండు గంటల్లోనే రైస్‌కార్డును చేతికి అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటాను.

– కిక్కర జోగమ్మ, రైస్‌కార్డు లబ్ధిదారు, నందిగాం

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



లక్కుపురం గ్రామంలో చేరిన వర్షపు నీరు

బూర్జ: మండలంలో గల లక్కుపురం గ్రామంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానకు గ్రామంలోకి వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

డిప్లొమా ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తి



విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో అందుబాటులో ఉన్న 12 డిప్లొమో, ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలోని డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి నేతృత్వంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.అనూరాధ ఆధ్వర్యంలో 491 మంది విద్యార్థులు వివిధ డిప్లొమో, ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఓవో, డీడీఐఏఎల్‌వై, డీఎంఎస్‌టీ, డీవోఎం, డీఆర్‌జీఏ, డీసీఏఆర్‌డీఐవో, డీసీఎల్‌టీ, డీఈసీజీ, డీఏఎన్ఎస్, డీఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఏఓ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సూపరింటెండెంట్ భాస్కరకుమార్, దాసు, ప్రసాద్, సంతోష్, విజయ సుందరీమణి, 12 కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గార : మండలంలోని సతివాడ గ్రామంలో ఉద్యానవన పంటల సాగును డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగుతున్న పంటలను రైతులతో పరిశీలించి సూచనలు చేశారు. వచ్చే ఏడాది నుంచి సాగు ద్వారా ఆదాయం వస్తుందని, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

మహాకవికి కళాత్మక నివాళి



స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం గురజాడ జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేక అధికారి డి.ఉషారత్నకుమారి, తెలుగు భాషా పండితులు లలితారెడ్డి, తోటి ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో గురువారం 5వేల ఉసిరి ఆకులతో గురజాడ 161వ జయంతి ఉత్సవం అంటూ కళాత్మకంగా తీర్చిదిద్దారు.

- జి.సిగడాం

అనుపు ఉత్సవం.. భక్తుల ఉత్సాహం



మూడు రోజుల పాటు గణపతిని పూజించిన భక్తులు అనుపు ఉత్సవాలను మొదలుపెట్టారు. ఎంత భక్తి శ్రద్ధలతో వినాయకుడిని పూజించారో అంతే ఉత్సాహంతో నిమజ్జన ఉత్సవాలను నిర్వహించారు. మేళ తాళాలు, డ్యాన్సులతో స్వామిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

- కవిటి

క్లుప్తంగా

పాలనాంశాలపై పట్టు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీలకు సంబంధించి పూర్తిస్థాయి పాలనాంశాలపై పట్టు అవసరమని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల నాలుగో విడత శిక్షణ కార్యక్రమానికి ఆయన గురువారం హాజరై మాట్లాడారు. ప్రధానంగా పాలన, పంచాయతీ రాజ్ చట్టాలు, గ్రామాల్లో లే అవుట్ ఏర్పాటు, అనుమతులపై అవగాహన అవసరమని చెప్పారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థలో గ్రామ కార్యదర్శుల పాత్ర కీలకమని వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ డీసీ పి.వి.రాజు, డీటీఎం ఎస్.లోకనాథ్ పాల్గొన్నారు.

మురసం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రఫీ

శ్రీకాకుళం కల్చరల్: ముస్లిం రచయితల సంఘం (మురసం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక వినుకొండలో జరిగింది. వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కవి కరీముల్లా పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలో రాష్ట్ర అధ్యక్షుడిగా అబ్దుల్ హకీమ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రముఖ కవి మహ్మద్ రఫీ(ఈవేమన) ఎన్నికయ్యారు. ఈ మేరకు సహాయ కార్యదర్శి రఫీ ఓ ప్రకటనలో తెలిపారు. మత సామరస్యం, సామాజిక, సాహిత్య చైతన్యం, తెలుగు భాషాభివృద్ధి వంటి లక్ష్యాలతో భారత రాజ్యాంగ విలువలకు కట్టుబడి ముస్లిం రచయితల సంఘం పనిచేస్తుందని తెలిపారు.

తాడివలస కార్యదర్శిపై విచారణ

పొందూరు: తాడివలస కార్యదర్శి వెంకటరావు ఇంటి పన్నులు పంచాయతీ ఖాతాకు జమచేయకుండా అవకతవకలకు పాల్పడ్డారంటూ తాడివలస గ్రామానికి చెందిన సీహెచ్ లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ సీపాన హరిహరరావు గురువారం విచారణ జరిపారు. ఇంటిపన్నులు వసూలు చేసి పంచాయతీ బిల్లులు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. విచారణ పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు అందస్తామని ఎంపీడీఓ చెప్పారు.

తానా కవయిత్రుల సమ్మేళనానికి 'మీనాక్షి'


రోణంకి మీనాక్షి

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈ నెల 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన తెలుగు అధ్యాపకురాలు, హరికథా భాగవతారిణి రోణంకి మీనాక్షిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తానా ఆధ్వర్యంలో ఇంతటి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో కవిత్వం వినిపించడానికి తనకు విశిష్టమైన స్థానం కల్పించిన తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ టి.ప్రసాద్, సమన్వయకర్త చిరుగురుమళ్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మన దేశంతోపాటుగా 15 దేశాల కవయిత్రులు, రచయితలు, ప్రముఖ సాహిత్య మహిళలు పాల్గొంటారని తెలిపారు.

బీచ్‌లో గల్లంతైన ప్రవీణ్ మృతి


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

ఆమదాలవలస, పోలాకి: ఆమదాలవలస మున్సిపాలిటీ 2వ వార్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన ప్రవీణ్‌కుమార్ అలియాస్ పవన్ (15) మంగళవారం కళింగపట్నం బీచ్‌లో సముద్రంలోకి దిగి గల్లంతయ్యాడు. గురువారం సాయంత్రం పోలాకి మండలం రాజారాంపురం గ్రామం సముద్ర తీరానికి ఒక మృతదేహం కొట్టుకురావడంతో దాన్ని మృతుని తల్లి కూన ఉషారాణి, బంధువులు చూసి గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. యువకుడి మృతితో కృష్ణాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మడానికి వీల్లేదు'

ఆమదాలవలస: విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాలు జరిపేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దాన్ని అమ్మేందుకు వీల్లేదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కురక్షణ యాత్ర బైక్ ర్యాలీ ఆమదాలవలస పట్టణంలోకి గురువారం రాత్రి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని గేటు ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి కష్ట నష్టాలు, కార్మికులకు కలిగే నష్టాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.జనార్దనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మినాయుడు, కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹245	₹ 265

మహతి.. రజతోత్సవ హారతి!

- పాతికేళ్లుగా సాహితీ సేవలో మహతి సంస్థ
- ఏటా లబ్ధప్రతిష్టులకు సాహితీ సత్కారాలు
- రూ.6లక్షల వరకు పలు సేవా సంస్థలకు ఆర్థిక సాయం
- నేడు మహతి రజతోత్సవం


పలువురు సాహితీవేత్తలు, కళాకారులకు సత్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: మహతి.. పాతికేళ్లుగా సాహితీ సేవ చేస్తున్న సంస్థ. ఎప్పుడో 1998లో డాక్టర్ ఈశ్వర సత్యనారాయణ ధన్వంతి ఆధ్వర్యంలో దూసి ధర్మారావు కార్యదర్శిగా ప్రముఖ సినీనటులు రావికొండలరావు, రాధాకుమారిలు ముఖ్య అతిథులుగా ఈ సంస్థను ప్రారంభించారు. నాటి నుంచి పండితుల ఉపన్యాసాలు, సంగీత కార్యక్రమాలు, ఘంటసాల ఆరాధనోత్సవాలు వంటివి నిర్వహించడం ద్వారా ఎందరో ఔత్సాహిక కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్నారు.

ఏటా విశిష్ట సాహితీ పురస్కారం

సంస్థ ఏర్పడిన నాటి నుంచి విశిష్ట సాహితీ పురస్కారాలను, రూ.5వేలు నగదు పారితోషికం అందిస్తోంది సంస్థ. అలాగే పలువురు కళాకారులకు, సాహితీ వేత్తలకు సత్కారాలను కూడా చేస్తున్నారు. మొదటిగా గొల్లపూడి మారుతీరావుతో ప్రారంభించిన పురస్కారాలు సామవేదం షణ్ముఖశర్మ, మల్లాజోస్యుల శ్రీమన్నారాయణ, గరికపాటి నరసింహారావు(సహస్రావధాని), మానప్రగడ శేషసాయి, ఆచార్య మలయవాసిని, కాశీపట్నం రామారావు మాస్టారు, ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు, భరత్ శర్మ, సంగీతావధాని మీగడ రామలింగస్వామి, కళాప్రవీణ బందారు చిట్టిబాబు, డాక్టర్ సనపల నారాయణమూర్తి, ఎల్లాప్రగడ రామకృష్ణ, హరికథకులు మండా కమలకుమారి, శలాక రఘునాథశర్మ, మానేపల్లి సత్యన్నారాయణ, అమరాపు సత్యం వంటి వారికి విశిష్ట పురస్కారాలను అందించారు. ఈ ఏడాది అష్టావధానికి పైడి హరనాథరావుకు అందించనున్నారు.

> **నేడు రజతోత్సవం**
>
> సంస్థ ఏర్పడి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఉపనిషన్మందిరంతో కలసి మహతి రజతోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ అష్టావధాని పైడి హరనాథరావుకు మహతి విశిష్ట సాహితీ పురస్కారాన్ని, రూ.5వేలు నగదు పారితోషికాన్ని అందించనున్నారు.

సేవలు, ఆర్థిక సాయాలు

వీటితో పాటుగా ఉచిత మెడికల్ క్యాంపులు వంటి సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా సంస్థలకు ఆర్థిక సాయాలు కూడా అందజేశారు. ప్రశాంతి వృద్ధజనాశ్రమానికి రూ.1 లక్ష, రెడ్‌క్రాస్ అనురాగ నిలయానికి రూ.1లక్ష, బెహరామనోవికాస కేంద్రానికి రూ.50వేలు, అమ్మ ఫౌండేషన్‌కు రూ.50వేలు, రంగస్థల కళాకారుల సమాఖ్యకు రూ.25వేలు, సత్యసాయి ఉచిత అన్నదాన కార్యక్రమానికి రూ.50 వేలు, మూగచెవిటి పాఠశాలకు రూ.25వేలు, ఉపనిషన్మందిరానికి రూ.2లక్షలు ఆర్థికంగా సాయం చేశారు. పేదలకు, అనాథలకు, స్త్రీసదన్, బాలసదన్, బెహరామనోవికాస కేంద్రం, లెప్రసీకాలనీ, శిశు సదన్‌లలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ప్రతినెల రూ.200లు పేద కళాకారులకు పింఛను అందిస్తున్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ 10మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. అరసవల్లిలో నిర్వహిస్తున్న బ్రాహ్మణ ఉచిత భోజన సత్రానికి రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన గాయనీగాయకులకు, నటులకు హరికథకులకు, నాట్య కళాకారులకు, సాహితీ వేత్తలు, సేవా తత్పరులు, వైద్యులను సత్కరించారు.

> **తండ్రి ఆశయం మేరకు..**
>
> 
>
> మా నాన్న ఏర్పాటు చేసిన ఈ సంస్థను నేను కన్వీనర్‌గా కొనసాగిస్తున్నాను. ఆయన ఆశయాలను కొనసాగిస్తు ప్రతి ఏడాది లబ్ధి ప్రతిష్టులకు పురస్కారాలను, ఉచిత మెడికల్ క్యాంపులు వంటి పలు సేవా కార్యక్రమాలను చేస్తున్నాం.
>
> – డాక్టర్ ఈశ్వర సూర్య సంపత్‌కుమార్, మహతి సంస్థ కన్వీనర్

'నారీ భేరి' విజయవంతం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలో జరగనున్న నారీభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఐద్వా నాయకురాలు శ్రీదేవి పాణిగ్రాహి పిలుపునిచ్చారు. మండలం నగరంపల్లిలో గురువారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ పై కేసు నమోదు చేయాలని పోరాడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అభ్యుదయ మహిళ జర్నలిస్టులు, రచయిత్రులపై వేధింపులు అధికమయ్యాయని, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి.సుగుణ, ఎస్.ఈశ్వరమ్మ, ఎస్.సరోజిని, బి.లక్ష్మి, పారమ్మ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ వైపు ఖాళీ మద్యం సీసాల లోడుతో వెళ్తున్న ఒక కంటైనర్ లారీ టెక్కలి సమీపంలోకి వచ్చే సరికి లారీ డ్రైవర్ ఎస్.గణేష్ నిద్రమత్తులో అదుపు తప్పి బొప్పాయిపురం సమీపంలో వంతెనను ఢీకొట్టాడు. అయితే అదేమార్గంలో సిమ్మెంట్ లోడ్‌తో విశాఖపట్నం నుంచి సోంపేట వైపు వెళ్తున్న మరో లారీ ఈ కంటైనర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంలో కంటైనర్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్ పి.రవికి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న టెక్కలి పోలీసులు క్రేన్ సాయంతో రహదారిపై ఉన్న లారీలను పక్కకు తొలగించారు. అనంతరం వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.


వంతెనను ఢీకొన్న కంటైనర్ లారీ

ఉద్దాన జానపద నృత్యానికి గుర్తింపు


ప్రశంసా పత్రం పొందుతున్న ఉద్దాన కళాకారుడు పత్రి తాతారావు

కాశీబుగ్గ: అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల్లో భాగంగా ఆర్కే ఫౌండేషన్ నిర్వహించిన వేడుకల్లో శ్రీకాకుళం జిల్లా ఉద్దాన జానపద నృత్యానికి గుర్తింపు లభించింది. పల్లె, జానపద, పంటపొలాల, గైరమ్మ పాటలకు ఆ పాటలకు చేసే నృత్యానికి గాను కొంతమంది కళాకారులను గుర్తించారు. ఈ సందర్భంగా ప్రముఖ తమిళ కన్నడ సినీనటి ఖుషిపురి చేతుల మీదుగా ఉత్తమ జానపద నృత్య కళాకరునిగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన పత్రి తాతారావు అనే కళాకారుడికి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్దాన ప్రాంతంలో పాటు, జిల్లా కళాకారులు అభినందనలు తెలుపుతున్నారు.

అవగాహనతోనే తెగుళ్లకు చెక్

- మొక్కజొన్నలో తెగుళ్ల యాజమాన్యం
- తెగుళ్లు గుర్తించకపోతే అంతా నాశనం
- శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు
- జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 10వేల హెక్టార్లలో సాగవుతున్న మొక్కజొన్న


మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

ఆమదాలవలస: మొక్కజొన్న పంటలో సమగ్ర తెగుళ్ల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞానకేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి తెలిపారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో పదివేల హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగవుతోందని తెలిపారు. రైతులు పంటపై అవగాహన లేక నష్టపోతున్నారని, ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే పంటలో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఆమె సూచించారు. తెగులు ఎక్కువగా సోకే ప్రాంతాల్లో పంట వేసే ముందు పచ్చిరొట్ట పైరును సాగు చేసి నేలలో కలియ దున్నాలని తెలిపారు. ట్రైకోడెర్మా శిలీంద్రాన్ని పశువుల ఎరువులు వృద్ధి చేసి మూడు నుంచి నాలుగేళ్ల వరుసగా నేలలో కలుపుతూ పోవాలని, ఎకరాకు అదనంగా 30 కిలోలు పొటాషియం ఇచ్చి ఎరువులను వేయాలని, ఎండాకాలంలో నేలను లోతుగా దున్నాలని చెప్పారు. పంట వేసిన తర్వాత ముఖ్యంగా పూత దశ నుంచి నేలలో తేమ తగ్గకుండా ఉండేలా నీటి తడులు పెట్టాలని, పంట కోసం తర్వాత తెగులు సోకిన మొక్కల భాగాలను ఏరి కాల్చివేయాలన్నారు. పంట మార్పిడి పద్ధతి అవలంబించాలని తెలిపారు. ఆమె వివరించిన తెగుళ్లు, నివారణ చర్యలు ఇలా ఉన్నాయి.

టర్సికం ఎండు తెగులు: ఆకులపై పొడవైన కోలాకారపు బూడిద రంగుతో కూడిన ఆకు పచ్చ లేక గోధుమ వర్ణపు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు 2.5 నుంచి 25 సెంటీమీటర్ల పొడవు, నాలుగు సెంటీమీటర్ల వెడల్పు ఉంటాయి. ఈ మచ్చలు మొదట మొక్క కింది ఆకులపై కనిపించి పెద్దవై పై ఆకులకు కూడా వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చనిపోయినట్లుగా కనిపిస్తాయి. శిలీంద్ర బీజాలు ఆకుల అడుగు భాగాన వలయాలుగా కనిపిస్తాయి. ఈ మచ్చల కండేపై ఉన్న పొట్టుపై కూడా వ్యాపిస్తాయి.


టర్సికం తెగులుతో ఉన్న మొక్కజొన్న చేను

నివారణ మార్గాలు: దీని నివారణకు మ్యాంగోజెబ్ ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారీ చేసి సమర్థంగా అరికట్టవచ్చు. విత్తే ముందు కిలో విత్తనానికి 2.5 గ్రాముల మ్యాంకోజెబ్ శిలీంద్ర నాశినితో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

త్రుప్పు తెగులు: ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కులు మాదిరిగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగిన కొద్దీ ఆకుల పైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. పూత సమయంలో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అధిక తేమ గల చల్లని వాతావరణంలో తెగులు ఉద్ధృతి, వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

దీని నివారణకు మ్యాన్కు జబ్ ఎకరాకు 500 గ్రాములు 200 నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండుసార్లు పిచికారీ చేయాలి.

బొగ్గు కుళ్లు తెగులు: పూత దశ తర్వాత ఆ నేలలో తేమ శాతం తగ్గడం, వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఈ తెగులు ఎక్కువ తీవ్రతతో సోకుతుంది. నేలలోని శిలీంద్రం మొక్కల వేర్ల ద్వారా కాండం పైభాగానికి వ్యాపిస్తుంది. కాండంపై గోధుమ రంగు చారలు ఏర్పడతాయి. ఈ తెగులు వల్ల పంట కోత దశకు రాక ముందే కాండం భాగం విరిగి మొక్కలు నేలపై పడిపోతాయి. ఇలాంటి మొక్కలను చీల్చి చూసినప్పుడు లోపల బెండు భాగం తెలుపు రంగులోనుంచి నలుపు రంగులోకి మారడం గమనించవచ్చు.

పాము పొడ తెగులు: ఈ తెగులు ముందుగా నేలకు దగ్గరగా ఉండే మొక్కల కింద ఆకులపై సోకి పై ఆకులకు, కాండానికి వ్యాపిస్తుంది. బూడిద గోధుమ మచ్చలు ఆకులు, కాండంపై ఒకదాని తర్వాత ఒకటి ఏర్పడి చూడటానికి పాము పొడ మాదిరిగా కనిపిస్తాయి.

దీని నివారణ నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఒకటి లేదా రెండు ఆకులు తీసివేయాలి. 200 గ్రాములు కార్బెండిసం లేదా 200 మిల్లీలీటర్ల ప్రాఫిట్ కానిస్టేబుల్ మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రతి సంవత్సరం ఈ తెగులు ఆశించే ప్రాంతాల్లో విత్తిన 40 రోజుల తర్వాత తెగులు సోకకముందే ఈ మందులు పిచికారీ చేయాలి.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


జిల్లా బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో క్రీడాకారుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులకు గెలుపోటముల కంటే, క్రీడాస్ఫూర్తిని కనబర్చి, క్రమశిక్షణతో మెలగడం ముఖ్యమని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ బాల్ జట్ల ఎంపిక పోటీలు గురువారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరై ఎంపికలను ప్రారంభిన ఎమ్మెస్సార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా క్రీడల ఖిల్లాగా పేరుగాంచిన విషయాన్ని క్రీడాకారులకు వివరించారు. జిల్లాలో బాస్కెట్‌బాల్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు సమష్టిగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు.

29 నుంచి మార్టేరులో రాష్ట్ర స్థాయి పోటీలు..

ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు మార్టేరు వేదికగా ఈనెల 29 నుంచి జరగనున్నాయని ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా జట్ల ఎంపికలను ఇక్కడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపికైన జిల్లా ప్రాబబుల్స్ క్రీడాకారులకు శిక్షణ శిబిరాలను నిర్వహించి త్వరలో జాబితాను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, జీఎంఆర్ కాలేజ్ నుంచి స్వాతి, బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు రాజు, హమీద్, లవకుమార్, ప్రవీణ్, యు.రవి, కొర్లయ్య, మురళి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి పోలీస్ స్టేషన్ వెనుక వరుసగా చోరీలు


బంగారు గొలుసు చోరీ జరిగిన సెల్ఫ్‌ను చూపుతున్న బాధితురాలు

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఉన్న ఎన్టీఆర్ కాలనీలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. కాలనీలో గల 5వ లైన్ వీధిలో నివాసం ఉంటున్న జానకి వనజాక్షి ఇంటిలోకి బుధవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి మెయిన్‌గేట్ తాళాలు, పక్క గేట్ తాళాలతో పాటు ఇంటి తలుపులు తెరచి మెయిన్‌హాల్ సెల్ఫ్‌లో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించారు. గురువారం ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో మొత్తం సామాన్లు చిందరవందరగా పడి ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. సామాన్లు చూసుకోగా మెయిన్‌హాల్ సెల్ఫ్‌లో భద్రపరచిన రెండు తులాల బంగారు గొలుసు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. దీంతో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు ఇంటి తాళాలు సైతం ఎత్తుకుపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మూడు రోజుల కిందట ఇదే ఇంటిలో పట్టపగలే దొంగలు చొరబడి ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఉన్న వీధిలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీవాసులంతా భయాందోళన చెందుతున్నారు.

మహిళా బిల్లుపై నల్ల రిబ్బన్లతో నిరసన


నోటికి నల్లరిబ్బన్లు కట్టి నిరసన తెలియజేస్తున్న బీసీ సంఘ నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్రం అమలు చేస్తున్న మహిళా బిల్లులో బీసీ/ఓబీసీలను చేర్చకపోవడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలియజేశారు. శ్రీకాకుళం నగరంలో జ్యోతిరావుపూలే పార్కులో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం బీసీలపట్ల మంచి హృదయంతో మహిళాబిల్లులో బీసీల సబ్‌కోటా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిట్ట చంద్రపతిరావు, పిట్ట భాగ్యచంద్రరావు, కలగ జగదీష్ యాదవ్, కర్రి రంగాజీదేవ్, పసగాడ రామకృష్ణ, అడపాక రాంబాబు, తిప్పాన గాంధీ, ఎల్.నాగరాజు, సూరిబాబు, హేమసుందర్, కె.రమణ, ఎ.గోవింద్, అలపాన త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో ప్రచార జాతా


కాశీబుగ్గలో మాట్లాడుతున్న యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రచార జాతా నిర్వహించారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమై శ్రీకాకుళం వెళ్తూ పలాసలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 1న రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతాలు విజయవాడ చేరుతాయని, అక్టోబర్ 1వ తేదీన పదివేల మంది ఉపాధ్యాయులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలాసలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యూటీఎఫ్‌గా సమాజంలో ఉండే రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడాలని, ఉపాధ్యాయ సంక్షేమమే కాకుండా పేద ప్రజానీక సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజ చౌదరి, రవీంద్ర రెడ్డి, మోహనరావు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి యూటీఎఫ్ శ్రీకాకుళం అగ్రనేత బొడ్డేపల్లి మోహనరావు పాల్గొన్నారు.